క్లుప్తంగా

నగరపాలక కమిషనర్‌గా రవీంద్రబాబు



కర్నూలు (టౌన్): కర్నూ లు నగరపాలక సంస్థ కమిషనర్‌గా సోంగా రవీంద్రబాబు నియమితులయ్యారు. మున్సిపల్ ప రిపాలనా శాఖసంయుక్త సంచాలకులుగా ఉన్న ఆయన ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం రాత్రి ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన 2015 నుంచి 2017 వరకు, అలాగే 2019 నుంచి 2020 వరకు కర్నూలు కమిషనర్‌గా పనిచేశారు.

సిటీ ప్లానర్‌గా పి.ప్రదీప్‌కుమార్

నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో సిటీ ప్లానర్‌గా పి.ప్రదీప్‌కుమార్ నియమితులయ్యారు. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేస్తూ గురువారం రాత్రి ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు.

నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్):ఒకేసారి వెయ్యిమందికిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనకు కారణమైన నూజివీడు ట్రిపుల్ ఐటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏఐడీఎస్ఓ నగర కార్యదర్శి మల్లేష్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నాలుగైదు రోజులుగా విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా అధికారులు నిర్లక్ష్య వైఖరితో ఉండడం ఎంతవరకు స బబు అని ప్రశ్నించారు. కళాశాలలోని అపరిశు భ్రత, నాణ్యత లేని ఆహారం అందించడం, వీ టిపై పర్యవేక్షణ లేకపోవడంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు.

జాతీయస్థాయిలో రాణిస్తే నజరానా

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు తన వంతుగా నజరానా అందిస్తానని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ప్రకటించారు. ఇటీవల 46వ జాతీయ స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొని మూడవ స్థానంలో నిలిచి పతకం సాధించిన క్రీడాకారులను ఆయన గురువారం తన నివాసంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. క్రీడాకారుల సంక్షేమానికి నిర్విరామంగా కృషి చేస్తానన్నారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టీజీవీ గ్రూపు సంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయన్నారు. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రుద్రా రెడ్డి, క్రీడాకారులు జగదీష్, రియాజ్, అఖి, సాగర్, భువనేష్ పాల్గొన్నారు.

రోగికి అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్‌లో ఓ వ్యక్తికి అరుదైన చికిత్స అందించి వైద్యులు ప్రాణాలు నిలిపారు. ఈ వివరాలను న్యూరోసర్జన్ డాక్టర్ విశ్వకుమార్ గురువారం వెల్లడించారు. 'ఓర్వకల్‌కు చెందిన తిరుమలేష్ (46) తీవ్ర తలనొప్పి, వాంతులతో ఇటీవల హాస్పిటల్‌కు వచ్చారు. అతనికి సీటీ బ్రెయిన్, యాంజియోగ్రామ్ పరీక్షలు చే యగా మెదడులో రక్తనాళం ఉబ్బినట్లు (బ్రెయి న్ అన్యూరిజమ్)గా గుర్తించారు. దీన్ని అలాగే వదిలేస్తే మెల్లగా రక్తనాళం మూసుకుపోయి మె దడు ఉబ్బిపోయే పరిస్థితి, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి ప్రాణాంతకంగా మారుతుంది. అతనికి వెంటనే శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేసి ఉబ్బిన రక్తనా ళానికి రక్తస్రావం అవ్వకుండా క్లిప్పింగ్ పద్ధతి లో మూసివేశారు. అనంతరం శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించి కొన్ని రోజుల పాటు వెంటిలేటర్‌పై ఉంచి కోలుకునేలా చేశారు. ప్రస్తుతం అతడు కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించారు.

నేడు రైతుబజార్ బంద్

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలులోని సి.క్యాంప్ రైతుబజార్‌ను శుక్రవారం ఒక్క రోజు బంద్ చేస్తున్నట్లు ఎస్టేట్ అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్ తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే రైతుబజార్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా సెలవు ప్రకటించినట్లు వారు గురువారం ఓ ప్రకటన వెల్లడించారు. శనివారం నుంచి యథావిధిగా రైతుబజార్ పనిచేస్తుందని, వినియోగదారులు, రైతులు గమనించాలని కోరారు.

రాజగోపురానికి రూ.1.94 లక్ష విరాళం

కౌతాళం: ఉరుకంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో రాజగోపుర నిర్మాణానికి గురువారం కర్నూలు పట్టణానికి చెందిన యాడికి శ్రీకాంత్ గుప్తా, రమ వారి కుటుంబ సభ్యులు రూ.1,94,000 అందజేసినట్లు ఆలయ డిప్యూటి కమిషనర్ గురుప్రసాద్ తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు.

నేడు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో ఆంజనేయస్వామి పండుగ సందర్భంగా శుక్ర, శనివారాల్లో రెండు రోజులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సురేష్, హరికృష్ణ గురువారం తెలిపారు. పోటీలను గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్నామని, గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ.10వేలు, రూ.7వేలు, రూ.4 వేలు, రూ.2 వేలను అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు ఉదయం 9 గంటలలోపు రూ.300 ఎంట్రీఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు సెల్ 9505814660, 7287045826 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మాతృభాషపై మమకారం పెంచుకోవాలి

కర్నూలు కల్చరల్: భారత పార్లమెంట్‌లో తెలుగులో మాట్లాడటం తనకు దక్కిన అరుదైన అవకాశమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గురువారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో గిడుగు రామ్మూర్తి పంతులు 161వ జయంతి పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో 12 నిమిషాల పాటు మాతృభాష తెలుగులో మాట్లాడటం గర్వంగా ఉందన్నారు. తెలుగు భాష వికాసానికి కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులను తెలుగు వారందరూ స్మరించుకోవాలన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ వ్యవహారిక భాష అభివృద్ధికి కృషి చేసిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. తెలుగు భాషకు విశిష్ట సేవలు అందించిన జీఎస్ఆర్‌కే శర్మ, మారేడు రాముడు, గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, డాక్టర్ తొగట సురేష్‌బాబు, డాక్టర్ బోరెల్లి హర్షను అతిథులు సత్కరించారు. దేశ భాషలందు తెలుగు లెస్స అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. నాట్యాచార్యులు కరీముల్లా శిష్య బృందం ప్రదర్శించిన తెలుగు భాషా ప్రాముఖ్యత నృత్యం ప్రేక్షకులను అలరించింది. అంతకుముందు గిడుగు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సమితి సభ్యులు గాండ్ల లక్ష్మన్న, ఇనాయతుల్లా, చంద్రకంటి మద్దయ్య, కాంతారావు, బాల వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య, యాగంటీశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.



గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

గిడుగు రామ్మూర్తి కృషి అమోఘం

కర్నూలు(సెంట్రల్): తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామ్మూర్తి పంతులు ఎంతో కృషి చేశారని, ఆయన స్ఫూర్తిని ముందుతరాలకు కొనసాగించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని వక్తలు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి డీఆర్వో కె.మధుసూధన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1863 ఆగస్టు 29న గిడుగు రామ్మూర్తి పంతులు శ్రీకాకుళం జిల్లాలో జన్మించారని, ఆయన జన్మదినోత్సవాన్ని తెలుగు భాష దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఆ రోజుల్లో తెలుగు గద్యభాగం ఎంతో కఠినంగా ఉండేదని దాన్ని ప్రజలు మాట్లాడుకునే వ్యవహారిక భాషలోకి అనువాదం చేసిన కీర్తి ఆయనకే దక్కుతుందన్నారు. ఒకప్పుడు హిందీ తరువాత తెలుగు భాషనే ఎక్కువగా మాట్లాడే వారని గుర్తుచేశారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కేవీఆర్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు పార్వతీదేవిని శాలువాతో సన్మానించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, జిల్లా పర్యాటక శాఖ అధికారి విజయ పాల్గొన్నారు.



గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు

కర్నూలు కల్చరల్: మాతృభాషపై మమకారం పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలుగు కల్లం సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ చిన్నావుల వేంకట రాజారెడ్డి అన్నారు. గురువారం సమితి ఆధ్వర్యంలో నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. తెలుగు భాష ఆవశ్యకతను నేటి తరం విద్యార్థులు తెలుసుకొని నడుచుకోవాలన్నారు. ఎస్వీ నాగయ్య, ఆవుల ఈశ్వరరెడ్డి, తదితరులు మాట్లాడారు. ఆలయ కమిటీ, సాహితీ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

కర్నూలుసిటీ: వ్యవహారిక భాషోద్యమానికి సారథ్యం వహించిన గిడుగు రామ్మూర్తి జయంతి వేడుక ల సందర్భంగా గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని పలు విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు.

- ఏక్యాంపులోని మాంటిస్సోరి స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో రచయిత హరికిషన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
- ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో నిర్వహించి న వేడుకలకు కవి, రచయిత ఇనాయతుల్లా ముఖ్య అతిథిగా,గుంటూరు చేబ్రోలు డిగ్రీ కాలేజీ ప్రిన్సి పాల్ డాక్టర్ వి.శ్రీదేవి గౌరవ అతిథిగా హాజరయ్యారు.
- శ్రీశంకరాస్ డిగ్రీకాలేజీలో జరిగిన వేడుకల్లో ఆ స్కూల్ డైరెక్టర్ బి.హరికిషన్, అధ్యాపకులు పాల్గొన్నారు.
- సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో జరిగిన వేడుకల్లో క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్, ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్ కుమార్ హాజరై గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఉస్మానియా డిగ్రీ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో రచయిత డాక్టర్ బి.వి స్వరూప సిన్హా, కరెస్పాండెంట్ అజ్రా జావెద్, అధ్యాపకులు పాల్గొన్నారు.
- కేశవరెడ్డి విద్యా సంస్థల్లో జరిగిన వేడుకల్లో వ్యవస్థాపక అధ్యక్షుడు కేశవరెడ్డి పాల్గొన్నారు. వేడుకల్లో విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.
- కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో నిర్వహించిన వేడుకలకు ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, రచయిత జె.ఎస్.ఆర్.కె శర్మలు పాల్గొని గిడుగు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

పోలీసులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కర్నూలు: పోలీసులు వాకింగ్, జాగింగ్ వంటి వ్యాయామాలకు కొంత సమయం కేటాయించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్పీ బిందుమాధవ్ సూచించారు. పోలీసు కార్యాలయంలోని హెడ్ క్వార్టర్స్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీసు కుటుంబాలకు గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఎస్పీ బిందుమాధవ్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, సిబ్బంది ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక దశలోనే సమస్యలను గుర్తించి చికిత్స పొందాలన్నారు. ఎస్పీతో పాటు డీఎస్పీలు, సీఐలు, పోలీసు సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కర్నూలు మెడికవర్ హాస్పిటల్, క్రౌన్ డెంటల్, శ్రీబాలసాయి ఐ హాస్పిటల్, లయన్స్ క్లబ్ అసోసియేషన్ డాక్టర్ల ఆధ్వర్యంలో పోలీసులకు బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎకో, బీఎండీ, పీఎఫ్‌టీ, బీఎంఐ, డెంటల్, హియరింగ్ టెస్ట్, కంటిచూపు పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు కూడా అందజేశారు. దాదాపు 200 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డీఎస్పీలు బాబుప్రసాద్, కృష్ణమోహన్, పోలీస్ వెల్ఫేర్ యూనిట్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): డబ్బే పరమావధిగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు, నగర అధ్యక్ష కార్యదర్శులు బాబయ్య, బీసన్న, జిల్లా కార్యవర్గసభ్యులు రాజు, చంటి తదితరులు గురువారం డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. నగరంలోని కిమ్స్ హాస్పిటల్‌లో కావేరి అనే చిన్నారికి డెంగీ జ్వరం సోకడంతో ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయాల్సి ఉన్నా డబ్బులు కట్టించుకున్నారని, చివరికి ఆ పాప మరణించిందన్నారు. అలాగే ఎస్ఆర్ పేటలోని యశోదా హాస్పిటల్‌లో డాక్టర్ నిర్లక్ష్యం వల్ల తెలంగాణకు చెందిన మాధవి ప్రాణాలు కోల్పోయిందని ఆరోపించారు. ఈ మరణాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

నేత్రదానంతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు

కర్నూలు(హాస్పిటల్): నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు ప్రసాదించిన వారవుతారని ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు చెప్పారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని గురువారం పోస్టుగ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులకు కంటి ఆసుపత్రిలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రపంచాన్ని చూడాలన్న, అందాన్ని ఆస్వాదించాలన్నా కళ్లతోనే సాధ్యమవుతుందని, అలాంటి కళ్లు లేకపోతే జీవితం అధకారమవుతుందన్నారు. నేత్రదానం చేసేందుకు ముందుకు వస్తే మరణానంతరం వారి నేత్రాలు సేకరించి చూపులేని వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. ప్రధానంగా చిన్నారుల్లో పోషకాహార లోపం, మీజిల్స్, సంక్రమణ కంటి వ్యాధులు, గాయాల బారిన పడటం, కంటి శస్త్రచికిత్సల అనంతరం ఇన్‌ఫెక్షన్ సోకడం, పుట్టుకతో వచ్చే కంటి వ్యాధుల కారణంగా చూపు దెబ్బతింటుందన్నారు. కంటిచూపు కోల్పోయిన వారికి కార్నియా ఆపరేషన్ చేయడం ద్వారా చూడగలిగేలా చేయవచ్చన్నారు. జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంధ్యారెడ్డి మాట్లాడుతూ.. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు, కళ్లద్దాలు ధరించేవారు, ఉబ్బసం వంటి వ్యాధులతో బాధపడేవారు, కంటి శుక్లాలకు శస్త్ర చికిత్స చేయించుకున్న వారు కూడా నేత్రదానం చేయవచ్చని వివరించారు. ఎయిడ్స్, హెపటైటిస్-బి, రేబిస్, పాముకాటు, పచ్చకామెర్లు, బ్లడ్ క్యాన్సర్, సెప్టిసీమియా వంటి వ్యాధులు ఉన్న వారు నేత్రదానం చేయకూడదన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ యుగంధర్‌రెడ్డి, ఆప్తాల్మిక్ ఆఫీసర్ పరమేశ్వరరెడ్డి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు

ఘనంగా కళాక్షేత్రం ప్రారంభపూజ

కర్నూలు కల్చరల్: సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ సత్యసాయి కళాక్షేత్ర ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూనగర్‌లోని సాయి మందిరంలో ఆవరణలో నిర్మించిన ఈ క్షేత్రంలో మొదటిరోజు వేద పండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, కలశస్థాపన, యంత్ర పూజ, అభిషేకం, గణపతి, రక్షోఘ్న, నవగ్రహ, రుద్ర, సుదర్శన, పద్మపురాణ అంతర్గత సంపుటికరణ మహాలక్ష్మి, వాస్తు హోమాలు, బలిహారం, పూర్ణాహుతి, వేద ఆశీర్వాద కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 8.27 గంటలకు కళాక్షేత్రం ప్రారంభం జరుగుతుందని సత్యసాయి సేవా సంస్థల కన్వీనర్ మాకా అశోక్ కుమార్ పేర్కొన్నారు.రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం 10 గంటలకు శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్య మంగళ కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు డి.సాయికృష్ణారెడ్డి, సాయిబాబా, రామ్మోహన్, లక్ష్మీ సరోజ తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న సత్యసాయి సేవా సంస్థల సభ్యులు

ఆర్‌యూలో నేడు వన మహోత్సవం

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు రాయలసీమ విశ్వవిద్యాలయంలో వన మహోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా ఫారెస్ట్ అధికారి ఐఎస్ఎఫ్ పి.శ్యామల తెలిపారు. ఆమె గురువారం డీఎఫ్ఓ కార్యాలయంలో మాట్లాడుతూ.. వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు సహకారంతో ఆర్‌యూ ఎన్ఎస్ఎస్ యూనిట్ సమన్వయంతో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎర్రచందనం మొక్కలు - 100, జామ - 23, రావి - 250, కానుగ - 330, పెల్టోఫార్మ్, సుంకేసుల, రెయిన్‌ట్రీ, చీమ చింత, వెలగ మొక్కలు ఒక్కొక్కటి 250 చొప్పున మొత్తం 2 వేల మొక్కలు నాటనున్నట్లు వివరించారు. అలాగే అరుదైన రకం శివలింగం మొక్కలు 10, రుద్రాక్ష మొక్కలు 5 నాటిస్తామన్నారు. వన మహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జేసీ బి.నవ్య, అటవీ శాఖ కర్నూలు సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ పి.రామకృష్ణ, విద్యార్థులు పాల్గొని ప్రతిజ్ఞ చేస్తారన్నారు.



మాట్లాడుతున్న డీఎఫ్ఓ పి.శ్యామల

భగవద్గీత పఠనంతో జీవిత గమనంలో మార్పు



సామూహిక భగవద్గీత పారాయణం చేస్తున్న సభ్యులు

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనంతో జీవిత గమనంలో మార్పులు సంభవిస్తాయని ఇస్కాన్ ధర్మ ప్రచారకులు రఘునందన్ సేవక్ దాస్ ప్రబోధించారు. గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో గురువారం సంకల్‌భాగ్‌లోని గీతా ప్రచార ధామంలో ఏకాదశిని పురస్కరించుకొని సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవునికి సుఖదుఃఖాలు సహజమని దుఃఖాలను భరించే శక్తి కావాలంటే భగవద్గీతను ఆశ్రయించాలన్నారు. సమస్త పాపాల నుంచి దూరం చేసి సదా భగవంతుడికి చేరువగా చేసేదే ఉపవాసమన్నారు. సంవత్సరంలో వచ్చే 24 ఏకాదశులకు ఒక్కొక్క ఏకాదశికి ఒక్కొక్క ప్రత్యేకత ఉందని వివరించారు. గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ, శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, సభ్యులు మహబలేష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరేష్

ఆలూరు రూరల్: యువకుడిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన గురువారం సాయంత్రం ఆలూరులో జరిగింది. పోలీసులు,బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న వీరేష్ సాయంత్రం రోడ్డుపై వెళ్తూ ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న రంగయ్యను పలకరించాడు. దీంతో రంగయ్య ఇంట్లో ఉన్న కత్తితో ఒక్క సారిగా వీరేష్‌పై దాడి చేశాడు. దాడిలో వీరేష్ తలకు,ఎడమ చేతికి తీవ్రగాయాలయ్యాయి. బంధువుల ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వీరేష్‌ను ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు రంగయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

గోనెగండ్ల: మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామం శివారు జగనన్న కాలనీ సమీపంలో బోయ కృష్ణ వద్ద కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ గంగాధర్ గురువారం తెలిపారు. 30 ఒరిజినల్ ఛాయిస్, డీలక్స్ విస్కిల 90 ఎంఎల్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి, ముద్దాయిని రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు.

ఏడీఎంఈ పదోన్నతుల జాబితాలో చోటు

కర్నూలు(హాస్పిటల్): అడిషనల్ డీఎంఈ పదోన్నతి జాబితాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు చెందిన పలువురు వైద్యులు ఉన్నారు. రాష్ట్రంలోని పలు బోధనాసుపత్రుల నుంచి అర్హులైన పలువురు సీనియర్ వైద్యులతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఉన్నతాధికారులు జాబితా 2024-25 ప్యానెల్‌ను రూపొందించారు. వీరిలో అడిషనల్ డీఎంఈగా పదోన్నతి పొందిన వారిని రాష్ట్రంలో ఖాళీగా ఉన్న బోధనాసుపత్రుల్లో ప్రిన్సిపాళ్లుగా, సూపరింటెండెంట్లుగా నియమించనున్నారు. ఈ జాబితాలో 11వ స్థానంలో డాక్టర్ కె.శ్రీనివాసులు (ఆర్థోపెడిక్స్), 12వ నంబర్‌లో డాక్టర్ సి.శ్రీనివాసులు (న్యూరాలజీ), 13వ నంబర్‌లో డాక్టర్ కె.రేవతి (ఆప్తమాలజీ), 28వ నంబర్‌లో డాక్టర్ జి.విశాల (అనెస్థీషియా), 31వ నంబర్‌లో డాక్టర్ కె.వెంకటేశ్వర్లు (ఆర్థోపెడిక్స్), 40వ నంబర్‌లో డాక్టర్ పి.శ్రీనివాసులు(ఎండోక్రైనాలజీ), 41వ నంబర్‌లో డాక్టర్ పి.రాజశేఖర్ (జనరల్ మెడిసిన్), 49వ నంబర్‌లో డాక్టర్ ఎ.రేణుకాదేవి (మైక్రోబయాలజీ), 56వ నంబర్‌లో డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి (కార్డియోథొరాసిక్ సర్జరీ), 88వ నంబర్‌లో డాక్టర్ పి.హరిచరణ్ (జనరల్ సర్జరీ), 91వ నంబర్‌లో డాక్టర్ సి.శ్రీకృష్ణప్రకాష్ (క్యాన్సర్), 101వ నంబర్‌లో డాక్టర్ ఎస్.అమీరున్నీసాబేగం (ఫిజియాలజీ), 110వ నంబర్‌లో డాక్టర్ బి.విజయానంద్‌బాబు(పీడియాట్రిక్స్), 112వ నంబర్‌లో డాక్టర్ ఎ.పద్మవిజయశ్రీ (బయోకెమిస్ట్రీ), 113వ నంబర్‌లో డాక్టర్ కేఎం.ఇక్బాల్ హుసేన్ (జనరల్ మెడిసిన్), 115వ నంబర్‌లో డాక్టర్ ఎస్.శివకుమార్ (పీడియాట్రిక్ సర్జరీ) ఉన్నారు. ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 2వ తేదీ లోగా తెలపాలని పేర్కొన్నారు.

స్టేడియం రూపురేఖలు మారుస్తాం

కర్నూలు (టౌన్): ఎంపీ నిధులతో కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం రూపురేఖలు మారుస్తానని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 22 నుంచి 28 వ తేదీ వరకు నిర్వహించిన అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో విజేతలకు కప్పులు, మెడల్స్ అందజేశారు. అలాగే వ్యవహారిక భాషా ఉద్యమకర్త గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. సెట్కూర్ సీఈఓ రమణ, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి గిడ్డయ్య, ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి హర్షవర్ధన్, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

స్కేటింగ్ అండర్-7 బాలుర విభాగంలో శ్రేయాన్స్ (ప్రథమ), నిహాల్ శౌర్య (ద్వితీయ), సమీర్ ఇబ్రహీం (తృతీయ), బాలికల విభాగంలో వనాలు (ప్రథమ), షియాజ్ సిద్దిఖ్ (ద్వితీయ), శ్రీయాజ్ (తృతీయ), జిమ్నాస్టిక్స్ బాలుర విభాగంలో గురుచరణ్ (ప్రథమ), ఆదిత్య (ద్వితీయ), సాత్విక్ (తృతీయ) బాలికల విభాగంలో ఆదియా (ప్రథమ), కీర్తి (ద్వితీయ), ప్రశాంత (తృతీయ)స్విమ్మింగ్ బాలుర విభాగంలో చిన్మయ నిఖిత్ (ప్రథమ), తనీ ర్ (ద్వితీయ), మహమ్మద్ అహమ్మద్ (తృతీయ) అథ్లెటిక్స్ 100 మీటర్ల పరుగు పందెంలో ప్రణయ్‌కుమార్ రెడ్డి (ప్రథమ), దినేశ్వర రెడ్డి (ద్వితీయ), అజయ్‌కుమార్ రెడ్డి (తృతీయ) తో పాటు యోగా, వాలీబాల్, ఖోఖో, సెపక్‌తక్రా, బాస్కెట్‌బాల్, రగ్బీ, ఫెన్సింగ్, వెయిట్ లిఫ్టింగ్ విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



విజేతలకు కప్పులు, మెడల్స్ అందజేసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

ఈత క్రీడాకారులకు అభినందన



ఈత పోటీల విజేతలతో కేడీఏఏ సభ్యులు

కర్నూలు కల్చరల్:జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్విమ్మింగ్‌పూల్‌లో జరిగిన ఈత పోటీల్లో గెలుపొందిన బాలబాలికలను నిర్వాహకులు అభినందించారు. కర్నూలు డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో విజేతలను అసోసియేషన్ కార్యదర్శి రామకృష్ణ యాదవ్, జాయింట్ సెక్రటరీ శివరాజ్, స్విమ్మింగ్ కోచ్ ఎ.నటరాజ్‌లు అభినందించారు.

ఉరుకుందలో భక్తుల రద్దీ

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా నాల్గవ చివరి గురువారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఉదయం నుంచే భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో తెల్లవారు జామున 4గంటల నుంచి దర్శనానికి వదిలారు. క్యూలైన్లు భక్తులతో నిండిపోయి దేవాలయం వెలుపల నిలబడి స్వామిని దర్శించుకోవడం కనిపించింది. స్వామిని దర్శించుకుని నైవేద్యం సమర్పించడానికి భక్తులు బుధవారం రాత్రి నుంచే తరలిరావడంతో ఈరన్న క్షేత్రం భక్తులతో పోటెత్తింది. భక్తుల సౌకర్యార్థం దేవాలయ అధికారులు ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ఉచిత దర్శనం, వీఐపీ దర్శనంల ద్వారా సౌకర్యం కల్పించారు. ఆరుబైయటే భక్తులు వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.



కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి





మందుబాబుల చేష్టలతో అధ్వానంగా మారిన దారి, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిపై తాగి పారేసిన మద్యం సీసాలు

● పర్మిట్ రూమ్ కాదు

ఫుట్ ఓవర్ బ్రిడ్జి!

పెద్దాసుపత్రి, కలెక్టరేట్ వద్ద ప్రజలు రోడ్డు దాటేందుకు ఏర్పాటుచేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ బ్రిడ్జ్ త్రీటౌన్ పోలీసుస్టేషన్‌కు కూత వేటు దూరంలోనే ఉన్నా మందు బాబులకు పర్మిట్ రూముగా మారిపోవడం విశేషం. అక్కడ నిత్యం మందు తాగడంతో పాటు కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. ఈ క్రమంలో కింద రోడ్డుపై వెళుతున్న వాహనదారులపై మూత్రం చుక్కలు పడుతున్నా తుడుచుకొని పోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. దీన్ని అరికట్టేందుకు కలెక్టరేట్ అధికారులుగాని, ఇటు త్రీటౌన్ పోలీసుస్టేషన్ సిబ్బందిగానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. నగర నడిబొడ్డున అత్యంత రద్దీ ప్రదేశంలో రోడ్డు దాటే వారికోసం ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఇలా మందుబాబులకు అడ్డాగా మారిపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు